## జడ్పీలో ఐదుగురికి పదోన్నతి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జడ్పీ పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు రికార్డు సహాయకులు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. మంగళవారం జడ్పీ అతిథిగృహంలో చైర్‌పర్సన్ పిరియా విజయ వారికి పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. కొత్త బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, సి-సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి ప్రతిమ చేసి.. సృజన చాటి..

- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో 'బుజ్జాయిల చేతిలో బొజ్జ గణపయ్య' నిర్వహణ
- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వినాయక బొమ్మల తయారీ
- ప్రతిభ చూపిన విద్యార్థులు





మట్టి ప్రతిమల తయారీని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

అరసవల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'బుజ్జాయిల చేతిలో బొజ్జ గణపయ్య' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అరసవల్లి రోడ్డులోని ఎల్ఎస్ గ్రీన్స్ ఫంక్షన్ హాల్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించగా అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా ఈ కార్యక్రమంలో పాల్గొని మట్టి వినాయక ప్రతిమలు చేసి.. సృజనాత్మకతను చాటారు. ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించిన ఆర్.టీ.రవితేజ డెవలపర్స్ అధినేత, బీజేపీ నాయకుడు, ఏటీబీఎస్ జాతీయ కన్వీనర్ పోకతోట సింహాచలం, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణశ్రీ, డా.శశిధర్ ఆసుపత్రి ఎమ్‌డీ డా.అన్నెపు శశిధర్, ఏషియన్ కేన్సర్ ఆసుపత్రి అధినేత డా.రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ సోమశంకరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శిల్పి టి.ప్రసాదరావు వినాయక ప్రతిమ తయారీ విధానాన్ని వివరించారు. దాని ప్రకారం విద్యార్థులు సృజనాత్మకతతో మట్టి ప్రతిమలు తయారుచేశారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు తయారుచేసిన ప్రతిమలను పరిశీలించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ 'చిన్నారులతో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. సంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంద'న్నారు.

మరిన్ని వివరాలు 6లో..



విజేతలతో స్పాన్సర్లు, 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు



వినాయక మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న విద్యార్థులు

## గణపతి పూజకు వేళాయె

- నేడు వినాయకచవితి
- నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన మండపాలు
- కిటకిటలాడిన మార్కెట్‌లు
- వర్షం కారణంగా తప్పని ఇబ్బందులు

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి వేడుకలకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. బుధవారం నుంచి గణపతి నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఊరూరా.. వీధివీధినా గణనాథుడి విగ్రహాలను కొలువు దీర్చేందుకు ఉత్సవ కమిటీలు మండపాలు సిద్ధం చేశాయి. ఎక్కడ చూసినా విద్యుత్ దీపాలు వెలుగులు కనిపిస్తున్నాయి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కొన్ని సూచనలు చేశారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల వరకే మైకులకు అనుమతి ఇచ్చారు. ఉత్సవాల్లో మద్యం, నిషేధిత వస్తువులు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం రోజున విగ్రహానికి తగ్గట్టు వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాలని, చెరువులు, నదుల వద్ద పిల్లలు, మైనర్లను దూరంగా ఉంచాలని చెప్పారు.

### వర్షమైనా.. మార్కెట్ రద్దీ

వినాయక చవితి సందర్భంగా శ్రీకాకుళంలోని పొట్టిశ్రీరాముల మార్కెట్, రైతుబజారు మంగళవారం రద్దీగా కనిపించాయి. ఓ వైపు వర్షం కురుస్తున్నా, పూజాసామగ్రి కొనుగోలు కోసం ప్రజలు మార్కెట్‌కు తరలివచ్చారు. వినాయక విగ్రహాలతో పాటు పండ్లు, పూలు, పూజాసామగ్రి విరివిగా కొనుగోలు చేశారు. వర్షం కారణంగా ఎక్కడికక్కడ రహదారులపై నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. రైతుబజార్ వద్ద, పెద్దమార్కెట్ కూడలిలో మోకాళ్లలోతు వరకు నీరు నిలిచిపోయి.. మురుగునీరు కూడా రోడ్డు పై ప్రవహించడంతో అవస్థలు పడ్డారు.





శ్రీకాకుళం పొట్టిశ్రీరాములు మార్కెట్‌లో రద్దీ



శ్రీకాకుళం పాతబస్టాండ్ నుంచి జడ్పీకి వెళ్లే రహదారి జలమయం



పెద్దపాడు దగ్గర జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

# సిక్కోలు జలమయం

- జిల్లా అంతటా కుండపోత వాన
- రహదారులపై నీటి ప్రవాహం
- చెరువులా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్
- నీట మునిగిన వరి పొలాలు

శ్రీకాకుళం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం

(మిగతా 6వ పేజీలో..)

**మంగళవారం నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)**

| | |
|---|---|
| శ్రీకాకుళం | 52.4 |
| ఎచ్చెర్ల | 28.8 |
| ఆమదాలవలస | 23.0 |
| జలుమూరు | 22.8 |
| సంతబొమ్మాళి | 19.6 |
| లావేరు | 18.6 |
| నరసన్నపేట | 18.2 |
| టెక్కలి | 17.6 |
| కోటబొమ్మాళి | 17.6 |
| రణస్థలం | 15.2 |
| పోలాకి | 13.4 |
| ఇచ్ఛాపురం | 12.0 |
| గార | 11.8 |
| సరుబుజ్జిలి | 10.2 |



పాత్రునివలస వద్ద పంట పొలాల్లో చేరిన వర్షపునీరు



శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో ప్రయాణికుల ఇక్కట్లు

### ముంపు సమస్యపై మంత్రి అసహనం

భారీ వర్షం కారణంగా శ్రీకాకుళంలో ముంపు సమస్యపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం కార్పొరేషన్ సహాయక కమిషనర్‌ను ప్రజాసదన్‌కు పిలిచి.. జాతీయ రహదారిపై పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడానికి కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తక్షణమే కాలువల్లో పూడికను తొలగించాలన్నారు. ప్రధాన డ్రైనేజీ వ్యవస్థపై శ్రద్ధ చూపించి అత్యవసర చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూడా హైవే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నీటి నిల్వకు గల కారణాలను తక్షణమే గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు.

## నిస్వార్థపరులకే పార్టీలో సముచిత స్థానం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం నిస్వార్థంగా పనిచేసే వారికి అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం కేంద్రపౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, శాసనసభ్యులతో కలిసి జిల్లా పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమష్టిగా ప్రతిఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేసి త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీలో కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తుందని స్పష్టం చేశారు. 'వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను, యువకులను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా అధైర్యపడకుండా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపునకు కీలకభూమిక పోషించారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసింది. ఎన్ని ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఏడాదిలోనే ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తూ సుపరిపాలన అందిస్తున్నామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణుల నుంచి పలు వినతులను మంత్రులు స్వీకరించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, మాజీఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, హోంమంత్రి అనిత తదితరులు..

## రేపటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- 12 బృందాల ఏర్పాటు

నరసన్నపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 28న జరగనుంది. శ్రీకాకుళంలోని మహాలక్ష్మీనగర్‌లో(డీఈవో కార్యాలయం వెనుక) విశ్వవిజేత జూనియర్ కళాశాలలో ఈ ప్రక్రియ నిర్వహణకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరిలకు చెందిన 543 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది. కళాశాలలో 15 గదులను సిద్ధం చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్ఎం, డిప్యూటీ తహసీల్దార్, ఎంఐఎస్ ఆపరేటర్లతో కూడిన 12 తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. మరో రెండు బృందాలను రిజర్వులో ఉంచారు. ప్రతీ బృందం 50 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లతో.. అభ్యర్థులు తీసుకువచ్చే కులధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు, మిగిలిన విద్యార్హత సర్టిఫికెట్లను ఇతర బృందం సభ్యులు పరిశీలిస్తారు.

- ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు విద్యాశాఖ పరిశీలకుడిని నియమించింది. అలాగే డీఈవో, డీవైఈవో, ఎగ్జామ్స్ ఏడీలు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. కళాశాలలో ఇంటర్ నెట్, విద్యుత్, తదితర సదుపాయాలకు అంతరాయం లేకుండా ఆయాశాఖ అధికారులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు.
- అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, కులధ్రువీకరణ, డిజేబుల్డ్ సర్టిఫికెట్, స్టడీ/రెసిడెన్షియల్ సర్టిఫికెట్, టెట్ మార్కుల కాపీ, డీఎస్సీ హాల్ టికెట్, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలి. ముందుగా అభ్యర్థి తన ఒరిజనల్ సర్టిఫికెట్లను వ్యక్తిగత లాగిన్‌లో స్కాన్ చేసి ఏపీడీఎస్సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అభ్యర్థితోపాటు సహాయకుడిగా లోపలకు ఒకరినే మాత్రమే అనుమతిస్తారు.

# ఉత్సాహంగా బుజ్జాయిల చేతుల్లో బొజ్జ గణపయ్య

● విద్యార్థుల చేతిలో రూపుదిద్దుకున్న గణనాధుడు


ప్రతిమల తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రసాదరావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి తదితరులు

అరసవల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో అరసవల్లి రోడ్డులో గల ఎల్ఎస్ గ్రీన్స్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పాఠశాల విద్యార్థులతో 'బుజ్జాయిల చేతిలో బొజ్జ గణపయ్య' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మట్టి గణపతులను రూపొందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 10 మంది విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలవలస జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ప్రథమ బహుమతి గురుగుబెల్లి చైతన్య, ద్వితీయ బహుమతి బి.దామోదర్, తృతీయ బహుమతి బుడుమూరు గోవిందమ్మలకు లభించాయి. అదే పాఠశాలకు చెందిన ఎ.మౌనిక, పి.తనూజ, జి.యామిని, శ్రీకాకుళంలోని వికాస్ హైస్కూల్ విద్యార్థులు సిహెచ్.పద్మశ్రీ, పి.శాంతిశ్రీ, న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ఎం.సిద్ధార్థరెడ్డి, ఎ.హరిచరణ్, కె.గిరిప్రసాద్, బి.కుమారస్వామి, పి.వాసులకు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు.

● ఈ కార్యక్రమానికి ప్రధాన స్పాన్సర్‌గా ఆర్‌టీ రవితేజ డెవలపర్స్ అధినేత పోకతోట సింహాచలం, కో స్పాన్సర్‌లుగా 'ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి', డా.శశిధర్ హాస్పిటల్, ఏషియన్ కేన్సర్ ఆస్పత్రి, శుభం సిల్వర్, జీఎస్ జ్యూవెలరీస్, న్యూ సెంట్రల్ స్కూల్, వందాన హాస్పిటల్, ఎస్ఎస్ జ్యూవెలరీ మార్ట్‌లతోపాటు.. బీజీఆర్ ఫౌండేషన్, శ్రీ విజయ వెంకటేశ్వర జ్యూవెలర్స్, ఎస్‌వీ కార్డియక్ మల్టీ స్పెషాలిటీ కేర్, ఆనందసాయి జ్యూవెలర్స్ అధినేతలు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ రిపోర్టర్ టి.సురేష్‌బాబు, యాడ్ మేనేజర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు గురుగుబెల్లి చైతన్య, బి.దామోదర్, బుడుమూరు గోవిందమ్మ

### ● ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అనారోగ్యం..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. చిన్నారులకు ఇప్పటి నుంచే పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించడం, మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించడం ఎంతో మంచి పరిణామం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు అందులో గల సీసం, మెగ్నీషియం. సల్ఫర్ నీటిలో కలిసి ఆరోగ్యానికి ఎంతో ప్రమాదకరంగా మారతాయి. మట్టి విగ్రహాలను వాడడం ద్వారా ఆరోగ్యంగా, ఆనందంగా మనం పండుగను జరుపుకోగలుగుతాం.

-కరుణశ్రీ, కాలుష్య నియంత్రణ సంస్థ ఇంజినీర్

### సృజనాత్మకత ప్రశంసనీయం..

చిన్నారులు ఎంతో సృజనాత్మకతతో విగ్రహాలను తయారు చేస్తున్నారు. నిజంగా చాలా గొప్పగా ఉంది. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'కు అభినందనలు.

-ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

### భాగస్వామిని కావడం అదృష్టం..



పాఠశాల విద్యార్థులతో ఇంత చక్కని కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు అభినందనలు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ వినాయక చవితిని జరుపుకునే విధంగా అవగాహన కల్పించేందుకు, వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. ఇటువంటి కార్యక్రమానికి సహకరించగలగడం నా అదృష్టం.

-పోకతోట సింహాచలం, ఆర్‌టీ డెవలపర్స్ (ప్రధాన స్పాన్సరర్)

### ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా..



పిల్లల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా.

-డాక్టర్ అన్నెపు శశిధర్, డా.శశిధర్ హాస్పిటల్స్

### ఆరోగ్యానికి మేలు..



నేడు కేన్సర్ కేసులు అధికంగా వస్తున్నాయి. మట్టి విగ్రహాల వినియోగం పర్యావరణ పరిరక్షణకే కాకుండా, ఇటువంటి భయంకర వ్యాధుల నివారణకు కూడా ఎంతో దోహదం చేస్తుంది. అందరూ ఆరోగ్యకరమైన వినాయక చతుర్థిని జరుపుకోవాలి.

-డాక్టర్ రవీంద్ర, కేన్సర్ స్పెషలిస్టు (ఏషియన్ కేన్సర్ ఆసుపత్రి)

### ఆనందంగా ఉంది..



ప్రథమ బహుమతిని గెలుచుకోవడం ఆనందంగా ఉంది. నేను తయారు చేసిన ఇదే మట్టి వినాయక ప్రతిమతో ఈ ఏడాది మా ఇంట్లో వినాయక చవితి పండుగను జరుపుకుంటాం. అందరూ పర్యావరణాన్ని రక్షించాలి. మట్టి ప్రతిమలనే వినియోగించాలి. అందరికీ ఈ విషయంపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తా.

-జి.చైతన్య, ప్రథమ బహుమతి, జెడ్పీహెచ్ఎస్, పిల్లలవలస

### అవగాహన కలిగింది..



తొలిసారిగా ఈ పోటీల్లో పాల్గొని... బహుమతి గెలుచుకున్నాను. ఈ కార్యక్రమం ద్వారా ఎంతో అవగాహన కలిగింది. ఇకపై ఏటా నేనే స్వయంగా మట్టి విగ్రహాలను తయారుచేసి పంపిణీ చేస్తా. వాటినే మా ఇంటిలో పూజకు వినియోగిస్తా. ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు.

-బి.దామోదర్, ద్వితీయ బహుమతి, జెడ్పీహెచ్ఎస్, పిల్లలవలస

### మట్టి విగ్రహాలనే వినియోగించాలి..



అందరూ మట్టి విగ్రహాలనే వినియోగించాలి. మట్టి ప్రతిమను ఎలా తయారు చేయాలో ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్నాను. పర్యావరణాన్ని కాపాడుతూ అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలి.

-బి.గోవిందమ్మ, తృతీయ బహుమతి, జెడ్పీహెచ్ఎస్, పిల్లలవలస

## బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

కోటబొమ్మాళి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు తప్పవని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి అన్నారు. మంగళవారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు పూర్తి కాకుండా పెళ్లిళ్లు చేయటం నేరమన్నారు. బాల్య వివాహాలు చేసే వారికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మా వతి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు పి.అర్జునరావు, పి.వాసుదేవరావు పాల్గొన్నారు.

## సిక్కోలు.. జలమయం

(ఐదో పేజీ తరువాయి)

వరకు కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. కనీవినీ ఎరుగని విధంగా శ్రీకాకుళం నగరంలో భారీ వర్షం కురిసింది. ఏకంగా 52.4 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో నగరం జలమయమైపోయింది. ఎక్కడ చూసినా వర్షపునీటితో రోడ్లు ముంపునకు గురయ్యాయి. వరదనీటి ప్రవాహంతో డేఅండ్‌నైట్ జంక్షన్, బలగలో కొన్ని వార్డులు.. రామలక్ష్మణ్ జంక్షన్.. రోడ్లు ఎక్కడున్నాయో.. కాలువలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక హుద్‌హుద్ తుఫాన్ సమయంలో మాదిరి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ వర్షపునీరు, మురుగునీటితో నిండిపోయింది. చుట్టూ సముద్రంలా నీరు కనిపించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాంప్లెక్స్ వెలుపల ఉన్న కాలువలు ఉప్పొంగిపోయాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. శ్రీకాకుళం మండలం పెద్దపాడు వద్ద పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. పాత్రునివలస వద్ద హైవేపై నీరు నిల్వచేరి.. వాహనాల రాకపోకలు కొన్ని గంటలపాటు నిలిచిపోయాయి. నరసన్నపేట, గార, ఎచ్చెర్ల, ఆమదాలవలస, జలుమూరు, లావేరు మండలాల్లో భారీవర్షం కురిసింది. ఆయా ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లోని వరిపంట ముంపునకు గురైంది. పొలాల్లో నీరుచేరి.. చెరువులను తలపించాయి.


పాత్రునివలస వద్ద జలమయమైన రహదారి

# ఒకటే వాన

● రహదారులు, పొలాలు జలమయం
● సిక్కోలును ముంచెత్తిన వరద
● వినాయక పూజా సామగ్రి విక్రయాలకు ఇక్కట్లు


గార వద్ద నీట మునిగిన పంట పొలాలు

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. రహదారులు జలమయమయ్యాయి. జాతీయ రహదారిపై సైతం వరద నీరు ప్రవహించింది. శ్రీకాకుళం పట్టణంలోని వీధులు, రోడ్లపై మోకాలి లోతున నీరు నిలిచిపోయింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడ్డారు.

### పెద్దపాడు జలమయం..

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దపాడు పంచాయతీ భారీ వర్షాలకు జలమయమైంది. గాంధీనగర్ కాలనీ రామ్‌మందిరం ప్రాంతంలోని వీధులన్నీ నీట మునిగాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. గృహోపకరణాలు తడిసి పనికిరాకుండా పోవడంతో గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామంలోకి నీరు చేరడానికి కారణం కాలువలో చెత్త పేరుకుపోవడమేనని గ్రామస్థులు గుర్తించారు. చెత్తను తొలగించడంతో నీరు కొంత మేర బయటకు వెళ్లింది. పెద్దపాడు జాతీయ రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వాహనాలను సర్వీసు రోడ్డువైపు మళ్లించారు.


శ్రీకాకుళం రూరల్: జాతీయ రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

### జలదిగ్బంధంలో జూనియర్ కళాశాల..

ఆమదాలవలస, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. మంగళవారం జూనియర్ కళాశాలకు అదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకోవాల్సిన విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో పట్టణం జలమయమైంది.


శ్రీకాకుళం రూరల్: ఇళ్లలోకి నీరు చేరిన దృశ్యం

### గార మండలంలో...


జలదిగ్బంధంలో కొత్తూరు సైరిగాం గ్రామం

గార/గార రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంట పొలాలు వర్షం నీటితో చెరువులను తలపిస్తున్నాయి. నీరు పొలాల్లో నిలిచిపోతే నారు కుళ్లిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనం కారణంగా సముద్రంలో అలజడి నెలకొంది. అలలు భారీగా ఎగసిపడుతున్నాయి. సముద్రం కొంత మేరకు ముందుకొచ్చింది. మత్స్యకారులు వేటకు దూరమయ్యారు. ఉప్పుగెడ్డ, భైరిదేశికాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సైరిగాం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. తహసీల్దారు చక్రవర్తి, ఎంపీడీవో రఘు సిబ్బందితో కలిసి గ్రామాన్ని పరిశీలించారు. వర్షాల వల్ల మంగళవారం గారలో జరిగే వారపు సంత వెలవెలబోయింది. వినాయకచవితి సందర్భంగా ఈ వారం బాగా సంత ఉంటుందని భావించిన వర్తకులు నిరాశ చెందారు.


టెక్కలి: నాలుగు రోడ్ల కూడలిలో నిలిచిన వర్షపునీరు


ఎచ్చెర్ల: ముద్దాడ వద్ద నీట మునిగిన పంట పొలాలు

### నరసన్నపేటలో...

నరసన్నపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తంపర భూముల్లో నీరు పోటెత్తింది. చిక్కాలవలస, మామిడివలస, సుందరాపురం, కంబకాయి, బసివలస, బాలసీమ, చోడవరం, పారశెల్లి గ్రామాల్లో తంపర భూముల్లో వరద నీరు చేరింది. చిక్కాలవలస, బాడాం, నడగాం వద్ద రైల్వే అండర్ పాసేజ్‌ల వద్ద నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పొలాల గట్లు తెగిపోయాయి. నదీ తీర ప్రాంతాల ప్రజలను తహసీల్దారు సత్యనారాయణ, ఎమ్పీడీవో మధుసూధనరావు అప్రమత్తం చేశారు. బొరిగివలస, బోర్డు ఉన్నత పాఠశాల, ప్రాథమిక, జగన్నాథపురం పాఠశాలల్లో వరదనీరు చేరింది.

### రాకపోకలు బంద్..

గొట్టిపల్లి అండర్ పాసేజ్‌లో వరదనీరు చేరింది. రెండువైపులా సర్వీసు రోడ్డు మీద నడుం లోతులో నీరు ప్రవహించడంతో నరసన్నపేట, జలుమూరు మండలాల్లోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెడ్డికపేట, బసివలస, బాలసీమ గ్రామస్థులు సత్యవరం మీదుగా రాకపోకలు సాగించారు. చిక్కాలవలస, నడగాం, కన్యకుర్తిపేట వద్ద రైల్వే అండర్ పాసేజ్‌లో వరదనీరు చేరడంతో నరసన్నపేట- జలుమూరు మండలాల మధ్య రాకపోకలు స్తంభించాయి. నరసన్నపేట పట్టణం జలమయమైంది. వీధుల్లో మోకాలి లోతులో నీరు ప్రవహించింది. శివనగర్ కాలనీలో ఇంజన్లతో నీటిని తోడారు. పట్టణ ప్రజలు శివారు ప్రాంతాలకు రావద్దని ఎస్ఐ దుర్గాప్రసాద్ అప్రమత్తం చేశారు.


నరసన్నపేట: కంబకాయి జంక్షన్ వద్ద రోడ్డు మీద నీటిలో చేపలు పడుతున్న స్థానికులు



నరసన్నపేట:గొట్టిపల్లి అండర్ పాసేజ్ వద్ద వరదనీరు


ఆమదాలవలస: జలదిగ్బంధంలో ఉన్న కళాశాల


పోలాకి: సుసరాం వద్ద నీట మునిగిన తంపర పొలాలు


నరసన్నపేట: గొట్టిపల్లి- కరగాం మధ్య వరదనీటిలో వరిపైరు


గార: కళింగపట్నం మెయిన్‌రోడ్డుపై వర్షపు నీరు


జలుమూరు: పాగోడు- వెలుసోద మధ్య రోడ్డుపై వరదనీరు

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి, రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

అరసవల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ సారథ్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఏడురోడ్ల కూడలిలో మంగళవారం 30 వేల వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని సంరక్షించడం దేశ సేవ అని, మట్టి గణేశ ప్రతిమలను వినియోగించడం ద్వారా కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. పదేళ్లుగా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తున్నామని, ఈ సంవత్సరం పర్యావరణ శాఖ, క్రెడాయ్ సహకారంతో 30వేల ప్రతిమలు, వ్రతకథ పుస్తకాలను భక్తులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు వి.సుధారాణి, డి.సురేంద్ర, క్రెడాయ్ ప్రతినిధులు రమేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఇంటి వద్దకే పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమల విగ్రహాల పంపిణీ చేపట్టారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలను నమోదు చేసుకున్న 3 వేల మందికి ఇళ్ల వద్ద అందజేశారు. మంగళవారం సూర్యమహల్ జంక్షన్ వద్ద స్టాల్ ఏర్పాటు చేసి 10 వేల ప్రతిమలను పంపిణీ చేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడులకు మట్టి వినాయక ప్రతిమలను మంత్రి కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ కరుణశ్రీ అందజేశారు.



కేంద్ర, రాష్ట్ర మంత్రులకు మట్టి వినాయక ప్రతిమను అందిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ కరుణశ్రీ

# కమ్యూనికేషన్ స్కిల్స్‌తోనే ఉజ్వల భవిత

● ఏయూ పూర్వపు వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజు

ఎచ్చెర్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కమ్యూనికేషన్స్ స్కిల్స్‌ను పెంపొందించుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ పొందవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్, ఏయూ పూర్వపు వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మంగళవారం ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వపు వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రతి పదేళ్లకోసారి శాస్త్ర, సాంకేతిక రంగంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. ఐఐటీ (అగర్తలా) పూర్వపు డైరెక్టర్ ప్రొఫెసర్ పీఎస్ అవధాని మాట్లాడుతూ.. సమర్థత, సమయ పాలన కలిగి ఉండాలన్నారు. ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లతో పాటు మన సంస్కృతీ, సంప్రదాయాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాళ్లు సీహెచ్.రాజశేఖరరావు, ఎం.అనూరాధ, ఎస్.ఉదయ భాస్కర్, డి.షాలిని, ఎం.రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

## మదర్ థెరిసాకు ఘన నివాళి

ఇచ్ఛాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విశ్వమాత మదర్ థెరిసా 116వ జయంతి కార్యక్రమం బలరాంపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. థెరిసా చిత్రపటానికి హెచ్ఎం జి.యశోద నివాళి అర్పించారు.

● లావేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారతరత్న మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయమని లావేరు శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గ్రంథాలయంలో థెరిసా జయంతిని నిర్వహించారు.

● రణస్థలం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నారువలో టీడీపీ సీనియర్ నాయకుడు నిద్రబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

## మండపాల్లో జాగ్రత్తలు పాటించాలి

పాత శ్రీకాకుళం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాలకు విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారి నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. తాత్కాలిక కనెక్షన్లు తీసుకోవాలని, మండపాలు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు కనీసం 3 మీటర్ల దూరంలో ఉండాలన్నారు. ఎల్ఈడీ లైట్లతో ఓవర్ లోడ్ లేకుండా నివారించాలన్నారు. అత్యవసర సమయాల్లో 1912కు సమాచారమివ్వాలన్నారు.

## హోంమంత్రిని కలిసిన ఎస్పీ



శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం జిల్లా పర్యటనకు రాగా స్థానిక పోలీస్ అతిథి గృహం వద్ద ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సాయుధ పోలీసు బలగాలు ఆమెకు గౌరవ వందనం చేశారు.

## చవితి వేడుకలు ప్రశాంతంగా చేసుకోవాలి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండగను, నిమజ్జన కార్య క్రమా లను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాటాడుతూ.. గణనాథని ఆశీస్సులతో ఆనందమయ జీవితాన్ని గడపాలన్నారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని ఆయన కోరారు.

## నీలమ్మ కాలనీలో విద్యార్థుల శ్రమదానం

ఎచ్చెర్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి సమీపంలోని తోటపాలెం రోడ్డులో ఉన్న నీలమ్మ కాలనీ నీట మునిగిందని తెలుసుకుని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం శ్రమదానం చేశారు. వీహెచ్‌పీ అధ్యక్షుడు ఆనందరావు తయారుచేయించిన భోజనాన్ని కాలనీ వాసులకు అందించారు. కార్యక్ర మంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు, పీవో డాక్టర్ టి.అసిరినాయుడు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గార రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, దీనివల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. బందరువానిపేటలో మంగళవారం న్యాయసదస్సు నిర్వహించారు. ఎటువంటి సమస్యకైనా జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను గాని, 15100 టోల్ ఫ్రీ నెంబరును గాని సంప్రదించి న్యాయ సలహాలు పొందవచ్చన్నారు. డీసీపీవో కె.రమణ, ఏపీసీ ఎస్.శశిభూషణ్, తహసీల్దార్ ఎం.చక్రవర్తి పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

జి.సిగడాం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మదుపాంలో గ్రామదేవత అసిరితల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించి ముర్రాటలు సమర్పించారు. సర్పంచ్ బోగాది అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి

ఆమదాలవలస, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మునగవలస గ్రామంలో మంగళవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అలికాం-బత్తిలి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న సెలూన్‌కు విద్యుత్ ప్రసరించింది. గ్రామానికి చెందిన చిన్నప్పన్న ఆవును మేత కోసం వదలగా అది దుకాణానికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే తనువు చాలించింది. చూలు ఆవు మృతి చెందడంతో రైతు కుటుంబం ఆవేదన వ్యక్తంచేసింది.

## పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా విశాలాక్షి

శ్రీకాకుళం లీగల్ ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జీవీఎస్‌యూ విశాలాక్షిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. విధుల్లో చేరిన నాటి నుంచి మూడేళ్ల పాటు స్పెషల్ పీపీగా కొనసాగుతారు. విశాలాక్షి నియామకంపై పలువురు న్యాయవాదులు అభినందించారు.

## చవితి సందడి

సోంపేట/ఇచ్ఛాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఏ కార్యక్రమం ప్రారంభించినా ముందుకు గణ నాథుని పూజ చేయడం ఆనవాయితీ. విఘ్నాలు లేకుండా చూడాలని వేడుకుంటూ పూజలు చేస్తారు. అటువంటి వినాయక చవితి సందర్భంగా మంగళవారం సోంపేట, ఇచ్ఛాపురం మార్కెట్ కిటకిటలాడింది. బుధవారం చవితి సందర్భంగా అవసరమైన పూజా సామగ్రి, పూలు, పండ్లు, విగ్రహాలతో పాటు కూరగాయలు కొనుగోలుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో మార్కెట్ కళకళలాడింది.

## లక్ష్మీపేట పాఠశాలలో పడిన స్లాబు పెచ్చులు



తరగతి గదిలో పడిన పెచ్చులు

పొందూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపేట ప్రాథమిక పాఠ శాలలో స్లాబ్ పూర్తిగా దెబ్బతిని పెచ్చులు ఊడిపడుతున్నాయి. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ పూర్తిగా నానిపోయి మంగళవారం తరగతి గదుల్లో పెచ్చులూడి కింద పడ్డాయి. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. తక్షణం పాఠశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఎస్ఎంసి చైర్మన్ చింతకాయల హరికృష్ణ తదితరులు కోరుతున్నారు.

## నీట మునిగిన ప్రాంతాల పరిశీలన



హైవే అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కు నీట మునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం పరిశీలించారు. పెద్దపాడు నుంచి సింగుపురం వరకు నేషనల్ హైవేపై నీరు నిలిచిపోవడంతో ఆయన హైవే అధికారులతో కలిసి ఆ ప్రాం తాలను పరిశీలించి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయ నతో పాటు టీడీపీ నాయకులు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# న్యూస్ బాక్స్

## సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అపరచితుల నుంచి ఫోన్ చేసి ఇంటి, నీటి, ఖాళీస్థలం పన్నులను ఫోన్‌పే ద్వారా చెల్లించాలని, తాము అధికారులమని సైబర్ నేరగాళ్లు అడుగుతుంటారని, అటువంటి వాటిని నమ్మవద్దన్నారు. పన్నులను పురపాలక సంఘం వార్డు అడ్మిన్ సెక్రటరీలు, మునిసిపల్ ఆర్ఐ, కార్యాలయం కౌంటర్లలో మాత్రమే చెల్లించాలని సూచించారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం

కవిటి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కవిటిలో వేంకటేశ్వరస్వామి ఆలయ గోపురాల నిర్మాణానికి ప్రగడ పుట్టుగకు చెందిన పిరియా కృష్ణారావు రూ.1,11,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో స్థానికులు బీపీరెడ్డి, ఎ.త్రివిక్రమరావు, ఎం.ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ మహిళా విభాగం ఎన్నిక

కవిటి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల మహిళా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దేవికా జెన్నా, ప్రధాన కార్యదర్శిగా కోరాడ లక్ష్మిని ఎన్నుకున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

## పింఛన్లను పునరుద్ధరించాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నాటి దివ్యాంగులు నేడు ఆరోగ్యవంతులయ్యారా. ఇదేనా మంచి ప్రభుత్వం అని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 5 లక్షల దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం

● పర్యావరణాన్ని పరిరక్షిద్దాం ● జిల్లా వ్యాప్తంగా ప్రతిమల పంపిణీ

మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని కాపాడుదామని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం వినాయక ప్రతిమలు, వస్త్రకల్ప పుస్తకాలను పంపిణీ జరిగింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల పర్యావరణానికి చాలా హాని జరుగుతుందని పలువురు పేర్కొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



రణస్థలం: పైడిభీమవరంలో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్, జనసేన నేత శ్రీనివాసరావు



ఇచ్ఛాపురం: వినాయక మట్టి ప్రతిమలు అందజేస్తున్న రోటరీ సభ్యులు



పాతపట్నం: వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



పలాస: డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రతిమలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

## కూతురి కాపురం సరిగాలేదని..

● మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

కోటబొమ్మాళి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూతురి కాపురం సరిగాలేదని మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బంజీరుపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. బంజీరుపేటకు చెందిన శిమ్మ సింహాచలం (59) అనే వ్యక్తికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సునీతకు తన బావమరిది మంచాల లక్ష్మణమూర్తికి ఇచ్చి వివాహం చేశాడు. చిన్నకుమార్తె హేమలతను తన మేనల్లుడు వాన ఆదినారాయణకు ఇచ్చి ఎనిమిది సంవత్సరాల కిందట పెళ్లి చేశాడు. హేమలత, ఆదినారాయణ మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె కొద్దిరోజుల కిందట తల్లిదండ్రుల ఇంటికి చేరుకుంది. దీంతో కూతురి జీవితం ఇలా తయారైందని తండ్రి సింహాచలం బాధపడేవాడు. మనస్తాపానికి గురై ఈనెల 22న నిద్రమాత్రలు మింగాడు. అది చూసిన భార్య వరలక్ష్మి 108కు ఫోన్‌చేసింది. ఆయన్ను 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సింహాచలం మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంగపండు సత్యనారాయణ తెలిపారు.

## పాతపట్నంలో వివాహిత..



దీపిక మృతదేహం

పాతపట్నం ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతినగర్‌లో నివాస ముంటున్న దీపిక కుమారి అలియాస్ సీతాదేవి చౌదరి(23) అనే వివాహిత ఉరేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దీపిక భర్త హీరారామ్ స్థానికంగా హార్డ్‌వేర్ వ్యాపారం చేస్తున్నాడు. రాజస్థాన్ చెందిన వీరికి నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. ప్రశాంతి నగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వీరితో పాటు హీరారామ్ సోదరుడు, బావ, మామయ్య కూడా అదే ఇంట్లో ఉంటూ హార్డ్‌వేర్ షాపులో పనిచేస్తున్నారు. దీపిక రాజస్థాన్ నుంచి నెలరోజుల కిందటే ఇక్కడకి వచ్చింది. కుటుంబ సభ్యులంతా పనికి వెళ్లిపోతుండడంతో ఇంట్లో ఒక్కరే ఉంటుంది. ఆమెకు తెలుగురాకపోవడంతో స్థానికంగా ఎవరితో మాట్లాడే అవకాశాలు లేకపోతున్నాయి. ఈ నెల 25న మధ్యాహ్నం ఎవరో బయట నుంచి ఇంటి తలుపు కొట్టడంతో భయపడి భర్తకు ఫోన్ చేసింది. దీంతో భర్త వచ్చి తలుపు కొట్టగా.. ఎవరో అనుకుని ఆమె తలుపులు తీస్తూ బాత్‌రూం క్లీనింగ్ ద్రావణాన్ని ఒక్కసారిగా విసిరింది. ఆ ద్రావణం హీరారామ్ కళ్లలోకి పడింది. దీంతో హీరారామ్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి చూపించగా కంటి చూపునకు ఇబ్బందికలిగేలా ఉందని వైద్యులు చెప్పారు. దీంతో భర్త తరఫు కుటుంబ సభ్యులు ఏమైనా అంటారేమోనని దీపిక భయపడి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన పడకగదిలో సీలింగ్ ఫ్యాన్‌కి చీరకట్టుకొని ఉరివేసుకుంది. షాపు నుంచి ఇంటికి వచ్చిన ఆమె మరిది దీపికను చూసి కిందకు దించాడు. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ బి.లావణ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారులకు ఆమె సమాచారమివ్వగా టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. భర్త హీరారామ్ ఇచ్చిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇది బలవన్మరణమా? లేదా ఇతరత్రా కారణాలు ఉన్నాయా అన్న సందేహాలను పోలీసులు సైతం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఆవుల అక్రమ రవాణా

జలుమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆవులను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. సారవకోట నుంచి నరసన్నపేట వైపు వ్యాన్‌లో పది ఆవులను అక్రమంగా తరలిస్తుండగా చల్లవానిపేట కూడలి వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. నరసన్నపేట మండలం బాడాం గ్రామానికి చెందిన డ్రైవరు రౌతు ధనుంజయరావుపై కేసు నమోదు చేసి, ఆవులను విజయనగరం జిల్లా గొజ్జిలవలస గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## గ్రోమోర్ సెంటర్‌లో విజిలెన్స్ తనిఖీలు

కొత్తూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌పై మంగళవారం విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్‌కుమార్ దాడి చేసి రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో నమోదు కాని కాంప్లెక్స్ ఎరువులు సుమారు 16.95 టన్నులను గుర్తించారు. వీటి విలువ రూ.4.57లక్షల ఉంటుందని, వీటి అమ్మకాలను నిలుపుదల చేయాలని సీఐ అన్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎర్రన్నాయుడు, వ్యవసాయ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

## పీతల పెంపకంతో జీవనోపాధి

సంతబొమ్మాళి,ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): పీతల పెంపకం ద్వారా మత్స్యకారులు జీవనోపాధి పొందవచ్చని కేంద్ర గ్రీన్ క్లయిమెట్ ఫండ్ టీం ఈసీఆర్ ఐసీసీ ప్రాజెక్టు సహజ వనరుల నిపుణులు మహ్మద్ రఫీ, జయంతి సితార్ అన్నారు. మరువాడ, వడ్డితాంద్ర గ్రామాలను వారు మంగళవారం సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. సముద్రపు నాచు, ఆల్చిప్పలు, అలంకరణ చేపలు, పీతలు పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. వీటి పెంపకంపై మత్స్యకారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఆర్థిక సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఎఫ్‌డీవో ధర్మరాజు పాత్రో, ఉపాధిహామీ ఏపీవో నర్సింహమూర్తి, సర్పంచ్ సూరాడ ధన లక్ష్మీదాసురాజు, ఎంపీటీసీ సూరాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## పనులు వేగవంతం చేయండి

పోలాకి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షించారు. రహదారులు, వివిధ అభివృద్ధి పనులు, భవన నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులు పూర్తిచేయించాలని అన్నారు. నాలుగు మండలాల పీఆర్ ఇంజనీర్లు, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

# రైతుల ఇబ్బందులు పట్టవా?

● ఎరువులు ఇవ్వడం లేదు ● సాగునీరు అందడం లేదు ● మండల సమావేశంలో సభ్యుల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

పలాసరూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రైతుల ఇబ్బందులు పట్టవా? అని అమలకుడియా సర్పంచ్ కొర్ల శిరీష, కిష్టుపురం ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నిం చారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. రైతులకు పూర్తిస్థాయిలో ఎరు వులు ఇవ్వడం లేదని, వర్షపు నీరే తప్ప.. వంశధార నీటిని ఇప్పటికీ మండలానికి పూర్తిస్థాయిలో అందించ లేదని, ఇలా అయితే శివారుభూముల పరిస్థితి ఏంటని సర్పంచ్ కొర్ల శిరీష, ఎంపీటీసీ సభ్యుడు మోహన్, ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయి అన్నారు. మామిడిపల్లి, బొడ్డపాడు గ్రామాల్లో నీటి ట్యాంకులను ఎందుకు శుభ్రం చేయడం లేదని బొడ్డపాడు ఎంపీటీసీ సభ్యుడు ఎం.పాపారావు ప్రశ్నించారు. పంచాయతీలకు 15వ సంఘం నిధులు వచ్చినా పూర్తిగా ఇవ్వడం లేదని, అధికారులు గ్రామాలకు పనుల పర్యవేక్షణకు వచ్చినప్పుడు కనీసం సమాచారం ఇవ్వడం లేదని, నిధులు, సమాచారం లేకపోతే తమకు పదవులు ఎందుకని సభలో నిలబడి వైసీపీ ప్రజాప్రతి నిధులు నిరసన వ్యక్తం చేశారు. కనీస సమాధానాలు ఇవ్వకుండా అధికారులు మిన్నకుండిపోవడం ఏమిటని చినంచల ఎంపీటీసీ సభ్యుడు డి.దుర్యోధన ప్రశ్నించారు. రెంటికోట రైతు సేవా కేంద్రం పనులు పూర్తి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ ఎస్.తిరుమలరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వసంత్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మెట్ట వైకుంఠరావు, వైస్ఎంపీపీ టి.శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యురాలు మచ్చ రత్నాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్మశాన స్థలం వివరాలు అందించండి

● తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలాస, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కంబిరిగాం రోడ్డులో వివాదస్పదంగా మారిన భూస్వాముల శ్మశాన స్థలాలను తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి మంగళవారం పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన 'ఆక్రమణలో కంబిరిగాం శ్మశాన భూములు' కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు ఆ స్థలాలను పరిశీలించి, కొందరు వ్యాపారులు వాటిని కబ్జా చేయడంపై ఆయన ప్రశ్నించారు. మొత్తం స్థలాలు ఎంత మేరకు అమ్మకాలు జరిగాయి, అందులో ప్రభుత్వానికి చెల్లించాల్సిన నాళా పన్ను మేరకు భూములు చదును చేస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్వే చేపట్టారు. ఈ స్థలాలపై ఎంత మేరకు లావాదేవీలు జరిగాయో వివరాలు అందించాలని వ్యాపారి శ్రీనివాస్‌ను కోరారు. తహసీల్దార్ వెంట సర్వేయర్ వై.గిరి, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## యూరియా కోసం బారులు



యూరియా కోసం ఓ దుకాణం వద్ద బారులుతీరిన రైతులు

ఎల్.ఎన్.పేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. వరి పైరుకు యూరియా వేసుకోవడానికి ఇదే మంచి అదును కోవడంతో దానికోసం రైతులు అన్వేషిస్తున్నారు. కావలసిన ఎరువులు అందించడంలో అధికారులు విఫలమవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో యూరియా కొనుగోలు కోసం ప్రైవేటు దుకాణాల వద్ద బారులు తీరున్నారు. దుకాణదారులు యూరియాతో పాటు తెగుళ్ల నివారణ మందులు అంటగడుతున్నారని రైతులు వాపోతున్నారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లోని ఓ దుకాణం వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు.

## వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి: డీఎస్పీ

టెక్కలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో వినాయక ఉత్సవాల నిర్వాహకులు పోలీస్ శాఖ పెట్టిన నిబంధనలు తప్పకుండా పాటించాలని డీఎస్పీ డి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మండపాల వద్ద ఇసుక, నీళ్లను ఉంచుకోవాలి. నిమజ్జన సమయంలో విద్యుత్ తీగలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీసులు అనుమతించిన మార్గాల్లోనే విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకొని వెళ్లాలి. మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి. లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే ఉపయోగించాలి. అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తాం.' అని తెలిపారు.

## మహిళల కబడ్డీలో జిల్లాకు ద్వితీయ స్థానం



ద్వితీయ స్థానం సాధించిన జిల్లా మహిళా కబడ్డీ జట్టు

కోటబొమ్మాళి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 24, 25 తేదీల్లో తిరుపతిలో జరిగిన అమరావతి చాంపియన్ ట్రోఫీ మహిళల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఫైనల్‌లో కృష్ణ జిల్లాపై రెండు పాయింట్ల తేడాతో ఓటమిపాలై ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈనెల 29న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నగదు బహుమతి అందించనున్నారు. జిల్లా కబడ్డీ జట్టులో కోటబొమ్మాళి జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు పి.గీతిక, జె.చంద్రలేఖ, జె.కవిత, ఎస్.చంద్రకళ ఉన్నట్లు హెచ్ఎం డి.గోవిందరావు తెలిపారు.

## యోగా పోటీలో సిల్వర్ మెడల్



సిల్వర్ మెడల్ అందుకుంటున్న జోగారావు

నరసన్నపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో నరసన్నపేటకు చెందిన పోగోటి జోగారావు సిల్వర్ మెడల్ సాధించాడు. నరసన్నపేటలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఆయన ఎంపికయ్యారు. అక్కడ సిల్వర్ మెడల్ సాధించిన జోగారావును స్థానిక వివేకనంద ధాన్యమండలి సభ్యులు అభినందించారు.

## వినాయక చవితిని సంతోషంగా జరుపుకోవాలి

● మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, శ్రేయస్సును నింపాలని ఆకాంక్షించారు. వినాయకుడి ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతూ ముందుకు పోతుందని అన్నారు.

## అధ్యాపకుల నియామకానికి 30న ఇంటర్వ్యూలు

టెక్కలి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టులకు సంబంధించి అతిథి అధ్యాపకుల నియామకం కోసం ఈ నెల 30న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గోవిందమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ (ఎమ్మెస్సీ)లో 55శాతం కంటే ఎక్కువ మార్కులు పొందిన అభ్యర్థులు అర్హులని అన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె కోరారు.







## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కొత్తూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మాతల గ్రామంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ స్మార్ట్ కార్డులతో రాష్ట్రంలో ఎక్కడైన రేషన్ సరుకులు తీసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గండివలస తేజేశ్వరావు పాల్గొన్నారు.

నరసన్నపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను వినియోగంలోకి తీసుకువచ్చిందని రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. మంగళవారం సత్యవరం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ, వెంకటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు మావుడూరి జగదీష్, కింజరాపు రామారావు, రావాడ గణపతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## తెప్పలకు తెలుగుతేజం పురస్కారం

పలాసరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుతేజం పురస్కారానికి స్థానిక జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి ఎంపికయ్యారు. ఈ నెల 31న తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా నరసాపురంలో జరిగే కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు పురస్కారం అందించనున్నారు.

## ఇద్దరికి ఇన్‌చార్జి ఆర్ఐలగా బాధ్యత

కొత్తూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఇద్దరు గ్రేడ్-1 వీఆర్వోలకు ఇన్‌చార్జి ఆర్ఐలుగా బాధ్యతలు అప్పగించినట్లు తహసీల్దార్ కొప్పల బాలకృష్ణ తెలిపారు. గురండి గ్రేడ్-1 వీఆర్వో వజ్జ బాలకృష్ణకు 14 సచివాలయాలు, వసప గ్రేడ్-1 వీఆర్వో గిరీష్‌కుమార్ పట్నాయిక్‌కు 13 సచివాలయాల పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించినట్లు చెప్పారు.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి

నందిగాం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వరిలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ సూచించారు. మంగళవారం కల్లాడ, దిమ్మిడిజోలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.







